www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 18 ఆగస్టు 2024

5

ఏలూరు

ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రైతులందరూ తమ పంటలను తప్పకుండా ఇ-క్రాప్ (పంట నమోదు)లో నమోదు చేయించుకొని ప్రభుత్వం అందించే రాయితీలను,సేవలను పొందాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. మండలంలోని వడ్లమాను, ఆగిరిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇ-క్రాప్ నమోదు, ప్రకృతి వ్యవసాయ పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పంట నమోదు చేస్తున్న ఆర్‌బికె (రైతు సేవ కేంద్రం) సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, ఎఇఒ కె.ధనబాబు, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి అల్లూన్నారాణి, విఎఎలు, విహెచ్‌ఎలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కొల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారంపై జిల్లావ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలు

ఏలూరు సిటీ : కొవ్వొత్తులతో ర్యాలీ

ఏలూరు అర్బన్ : మద్దతు లెటర్ ఇస్తున్న మెడికల్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోల్‌కత్తా ఆర్‌జికర్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆందోళనలకు ఎపి మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ మద్దతు తెలిపింది. శనివారం ఉదయం ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్ద మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి ఐఎంఎ నాయకులు డాక్టర్ ఎఎస్.రామ్‌కు యూనియన్ నాయకులు మద్దతు లెటర్‌ను అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు బివి.సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం వారు చేపట్టిన నిరసన ర్యాలీలో యూనియన్ సభ్యులందరూ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రిప్రజెంటిటీవ్స్ యూనియన్ నాయకులు మహేష్, దుర్గారావు, గణేష్, నరేష్, రామకృష్ణ, కిషోర్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏలూరు సర్వజన ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లికార్జునరాజు డిమాండ్ చేశారు. ఎపి జూనియర్ డాక్టర్ల సంఘం, ఇండియన్ మెడికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ వైద్యులు శనివారం నగరంలో ఆందోళన చేపట్టారు. జిల్లా ఆసుపత్రి నుంచి ఫైర్‌స్టేషన్ మీదుగా తిరిగి జిల్లా ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. వీరికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, ఇతర ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా మల్లికార్జునరాజు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా సమితి కార్యదర్శి మన్నవ యామిని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్స్, పలు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

చింతలపూడిలో..

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్నియ ఖండిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ, స్త్రీ విముక్తి సంఘటన సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఫైర్‌స్టేషన్ నుండి కొత్త బస్టాండ్ మీదుగా తిరిగి ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌ఒ జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు టి.చిన్ని మాట్లాడారు. అనంతరం ఫైర్‌స్టేషన్ నుండి జిల్లా పరిషత్ ఆఫీస్ మీదుగా కలెక్టరేట్, డిఇఒ ఆఫీస్ మీదుగా జిల్లా ప్రభుత్వాసుపత్రి వరకు ప్రదర్శన నిర్వహించారు. ఏలూరు జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో చేపట్టిన నిరసనలో రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాషా మాట్లాడారు. కార్యక్రమాలకు పిడిఎస్‌ఒ నాయకులు ఎం.రాజా, అనుదీప్, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కె.పద్మ, కళ్యాణి నాయకత్వం వహించారు.

ఏలూరు సిటీ : జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో డ్యూటీలో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కళ్యాణ మహేశ్వరి, కోండ్రుకోట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్ఞానేశ్వరి, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని దేవపూడి, ముదినేపల్లి, గురజ పిహెచ్‌సిల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్లకార్డులు చేత పట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. మృతిచెందిన వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆయా పిహెచ్‌సిల వైద్యులు శాంతి శ్రీ, శ్వేత, తారాణి, స్వాతి, మధు, వినయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : కొల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా శనివారం మండలంలోని మూడు పిహెచ్‌సిల వైద్యులు, సిబ్బంది అధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

జీలుగుమిల్లిలో..

తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ విధుల్లో ఉన్న వైద్యులపై అకృత్యాలు, అఘాయిత్యాలకు, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గాయత్రి, దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి: మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, దాడులను ప్రభుత్వాలు వెంటనే అరికట్టాలని చింతలపూడి ప్రభుత్వాసుపత్రి ఆర్‌ఎంఒ హఫీజ్‌ఖాన్, ఏరియా హాస్పిటల్ డాక్టర్ జ్యోత్స్న అన్నారు. ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కొండ్రు దేవా, భారతి పాల్గొన్నారు. చింతలపూడి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రసూల్ మాట్లాడారు.

నూజివీడు టౌన్: జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఐఎంఎ ఆధ్వర్యాన విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో నూజివీడు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ నరేందర్‌సింగ్ మాట్లాడారు.

ముసునూరు: ముసునూరు పిహెచ్‌సి సిబ్బంది నల్లరిబ్బను ధరించి నిరసన తెలిపారు. వైద్యాధికారి షాకినా ఇవాంజిలీన్ మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

కొయ్యలగూడెం: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఆరోగ్య ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు కె.లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. వినాయకుని ఆలయం వద్ద నుంచి తహశీల్దార్

కొయ్యలగూడెంలో...

కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ దొరకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అభిషా పిల్లల ఆసుపత్రి వైద్యులు ఎం.గుణశేఖర్, లలిత ప్రియ ఆర్థోపెడిక్ హాస్పిటల్ వైద్యులు రాజశేఖర్, శ్రీఆరోగ్య ఆసుపత్రి వైద్యులు నరహరశెట్టి సతీష్, పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు ఆనందం సుబ్బారావు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్, అధ్యక్షులు ప్రసాద్‌రావు, గుడిమెట్ల గంగాధరరావు, ప్రయివేటు ఆసుపత్రుల సిబ్బంది, పిఎంపి అసోసియేషన్ సభ్యులు, మెడికల్ షాప్‌ల వారు, రక్త పరీక్ష కేంద్రాల టెక్నీషియన్లు పాల్గొన్నారు.

దెందులూరు: పిహెచ్‌సిలో వైద్యులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. దెందులూరు సామాజిక ఆరగ్యకేంద్రం వైద్యులు బివి.సుందర్‌బాబు, డాక్టర్ బి.షాలిని, డాక్టర్ ఎం.ప్రియదర్శిని, డాక్టర్ సిహెచ్.ప్రియాంక, డాక్టర్ ప్రసాద్‌నాయక్, డాక్టర్ ఎ.పవన్, డాక్టర్ వి.అరవింద, ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు వినతి అందించారు.

టి.నరసాపురం: వైద్యసిబ్బంది టి.నరసాపురంలో శనివారం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ప్రధాన సెంటర్లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమాన్నుద్దేశించి అరసం రాష్ట్ర కార్యదర్శి బిఎన్.సాగర్, మండల వైద్యాధికారి డాక్టర్ జె.కల్పనారాణి మాట్లాడారు. ఈ ప్రదర్శనలో డాక్టర్ ఆర్.ఫణీంద్రబాబు, ఎంఎన్‌ఒ ఖాదర్‌భాషా, విజన్ స్కూల్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్, సాయిసూర్య హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సగ్గూరు పిహెచ్‌సి వైద్యాధికారి మంజులదేవి డిమాండ్ చేశారు. మండలంలోని మూడు పిహెచ్‌సిల వైద్యసిబ్బంది, ప్రయివేటు హాస్పిటల్స్, ఆర్‌ఎంపి, పిఎంపి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ చేబ్రోలు పిహెచ్‌సి సిబ్బంది నల్లరిబ్బన్లు ధరించి ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్ కెఎస్.సుబ్బరాజువర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో...

కలిదిండి: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ మండలంలో ఆర్‌ఎంపి, పిఎంపి గ్రామీణ వైద్యులు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు బంద్ పాటించినట్లు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఫెడరేషన్ పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వెంకటరాజు తెలిపారు.

నిడమర్రు: పెదనిండ్రకొలనులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాగ్యశ్రీ, డాక్టర్ తేజశ్రీ మాట్లాడారు. ర్యాలీ అనంతరం మానవహారం నిర్వహించారు.

బుట్టాయగూడెం: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ప్రెస్‌క్లబ్, జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాల, విద్యారోహిణి పాఠశాల విద్యార్థులు హైస్కూల్ సెంటర్ నుండి నెహ్రూ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ కె.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో బుట్టాయగూడెం సిహెచ్‌సి సూపరిం టెండెంట్ వసుంధర, డాక్టర్ హేమంత్, విద్యా రోహిణి స్కూల్ ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడారు.

పోలవరం: వైద్యులపై హత్యాచారాలను అరికట్టాలని పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యులు విష్ణువర్ధిని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కేంద్రం వద్ద వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు విష్ణువర్ధిని, సూపరింటెండెంట్ రాంబాబు దొర మాట్లాడగా వైద్యులు కృష్ణంరాజు, సునీల్‌కుమార్, జ్యోతి, భార్గవ్, గుణశేఖర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడులో...

పాలకొల్లు : శ్రీరామ్మూర్తి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న బలరాం, రాజగోపాల్, శ్రీనివాస్, నేతలు

ఏలూరు : భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంతెన సీతారాం, రవి, బాబూరావు, నరసింహారావు, నేతలు

ఉద్యమాల ముద్దుబిడ్డ శ్రీరామ్మూర్తి ఇక లేరు

ఉపాధ్యాయ, రైతు ఉద్యమంలో కీలక పాత్ర

తుదిశ్వాస విడిచే వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఆశ్రం ఆసుపత్రికి భౌతికకాయం అప్పగింత

ప్రజాశక్తి - పాలకొల్లు

వలవల శ్రీరామ్మూర్తి(ఫైల్‌ఫొటో)

సిపిఎం సీనియర్ నేత వలవల శ్రీరామ్మూర్తి (90) శనివారం ఉదయం కన్నుమూశారు. ఆయన వారం రోజుల క్రితం అస్వస్థతకు ఉండటంతో రాజమండ్రిలోని ప్రయివేట్ హాస్పిటల్‌లో చేర్చారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని శనివారం మధ్యాహ్నం పాలకొల్లులోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. ఆయనకు ఇరువురు కుమారులు, అల్లుడు ఉన్నారు. వలవల శ్రీరామ్మూర్తి చనిపోయేవరకు ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన ఉపాధ్యాయులుగా సుమారు 25 సంవత్సరాలు పని చేశారు. అనంతరం 30 సంవత్సరాల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేసి సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా పని చేశారు.

జిల్లాలో యుటిఎఫ్, రైతు ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన ఇక లేరంటే నమ్మలేకపోతున్నామని పలువురు కార్యకర్తలు కన్నీటిపర్యంతమయ్యారు.

ఆయన భౌతికకాయాన్ని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, సిపిఎం, ప్రజాసంఘాల నేతలు, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పట్టణ ప్రధాన రోడ్డు గుండా హౌసింగ్ బోర్డు శివారు వరకు అంతిమయాత్ర నిర్వహించారు. యాత్రలో ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

భీమవరం: ఉద్యమాల ముద్దుబిడ్డ వలవల శ్రీరామ్మూర్తి (90) మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తిగా.. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రధాన భూమిక పోషించిన శ్రీరామ్మూర్తి మరణం అందరినీ కలిచివేసిందని పేర్కొన్నారు. 1935లో వలవల శ్రీరామ్మూర్తి జన్మించారు. ఉపాధ్యాయునిగా పని చేసిన ఆయన అభ్యుదయ భావాలు, సోషలిస్టు చైతన్యంతో జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించారు. యుటిఎఫ్ జిల్లా ముఖ్య బాధ్యతలు నిర్వర్తించారు. కమ్యూనిస్టు అగ్రనేతలైన ఉద్దరాజు రామం, అల్లూరు సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్), ఎస్‌ఆర్.పోలిశెట్టి వంటి నాయకుల స్ఫూర్తితో సిపిఎం సభ్యత్వం పొందారు. పార్టీ అవసరాల మేరకు నాయకత్వం కోరిన వెంటనే 1984లో ఉద్యోగం నుండి వైదొలిగి పార్టీ పూర్తికాలం కార్యకర్తగా బాధ్యతలు చేపట్టారు. సిపిఎం నరసాపురం డివిజన్ కార్యదర్శిగా, రైతుసంఘం జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎంతోకాలం పని చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వర్తించారు. సాహితీమిత్రులందరినీ సమీకరించి సాహితీస్రవంతి నిర్మాణానికి పూనుకున్నారు. ప్రజాశక్తి, మార్క్సిస్టు, రైతువాణి, ఐక్య ఉపాధ్యాయ పత్రికల చందాల చేర్పింపునకు విశేష కృషి చేశారు. వయస్సు మీద పడినా చివరి వరకు ఎంతో అంకితభావంతో పార్టీ కోసం పరితపించారు. పార్టీ, రైతుసంఘం నిర్వహించిన పలు ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేశారు. అనేక సందర్భాల్లో పార్టీకి, రైతు-ప్రజా సంఘాలకు భూరి విరాళం అందించడంలో ప్రముఖ భూమిక పోషించారు. శ్రీరామ్మూర్తి భార్య, కుమార్తె మరణించినప్పటికీ కుంగిపోకుండా మనోధైర్యంతో ముందుకు సాగడమే కాకుండా దృఢంగా ప్రజాఉద్యమాలను ముందుకు నడిపించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని, ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ ప్రతినబూనాలని బలరాం పిలుపునిచ్చారు.

ధన్యజీవి శ్రీరామ్మూర్తి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ఏలూరుఅర్బన్: సిపిఎం ఉమ్మడి జిల్లా పూర్వ కార్యదర్శివర్గ సభ్యులు, రైతుసంఘం నేత వలవల శ్రీరామ్మూర్తి ధన్యజీవి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కొనియాడారు. శ్రీరామ్మూర్తి శనివారం ఉదయం రాజమండ్రిలోని ఒక ప్రయివేటుయ ఆసుపత్రిలో మరణించారు. అనంతరం అక్కడే నేత్రదానం పూర్తి చేసి భౌతికకాయాన్ని స్వగ్రామం పాలకొల్లు తీసుకొచ్చారు. అక్కడ పలువురు నివాళులు అర్పించిన అనంతరం శనివారం రాత్రి ఏలూరు ఆశ్రం కాలేజీకి తరలించి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు వైద్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు జిల్లాయ కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగిన సంతాపసభలో మంతెన సీతారాం మాట్లాడుతూ చివరివరకు ప్రజలు, పార్టీ కోసం పనిచేసిన ధన్యజీవి శ్రీరామ్మూర్తి అని అన్నారు. ప్రజా ఉద్యమాల్లో ఫలితం వచ్చేదాకా పనిచేయటంలో శ్రీరామ్మూర్తి ఎనలేని కృషి చేశారన్నారు. సభలో పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు తదితరులు మాట్లాడారు. సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్, రైతు, వ్యవసాయకార్మిక, ఐద్వా జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, ఎ.శ్యామలారాణి, వివిధ ప్రజా సంఘాల జిల్లా నాయకులు జివిఎల్.నరసింహారావు, పివి.నరసింహారావుతోపాటు శ్రీరామ్మూర్తి కుమారులు, మనుమడు, బంధువులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా

చింతలపూడి ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి సంకల్పంతో పని చేస్తున్నానని ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ అన్ని శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని, సమస్యలు ఏమున్నాయి, వాటిని ఎలా పరిష్కరించాలనేది రిపోర్ట్‌తో రావాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడు తూ ఉద్యోగులందరూ కష్టపడి పని చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజ సుధాకర్, వైస్ ఎంపిపి వరలక్ష్మి, జనసేన మండలాధ్యక్షులు మధుబాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, మండల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

విఆర్‌ఒ రశీదుతోపాటు ఆర్‌డిఒ అనుమతి లేఖ కూడా ఉండాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు స్టాక్ పాయింట్ల వద్దకు 20 టన్నులకు మించి సామర్థ్యం కలిగిన వాహనాలను అనుమతించొద్దని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం జిల్లా ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఒక్క టన్ను ఇసుక కూడా అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఒక వ్యక్తికి (ఆధార్ కార్డు) 20 టన్నులకు మించి మంజూరు చేయరని, ఇసుక స్టాక్ పాయింట్ల వద్దకు 20 టన్నుల సామర్థ్యానికి మించిన వాహనాలను అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట, వింజరం, ఉంగుటూరు మండలంలోని చేబ్రోలులో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టాక్ పాయింట్ల వద్ద ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకే ఇసుక లోడింగ్ జరుగుతుందని, ఆ సమయం తరువాత ఇసుక అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షించేందుకు పోలీసు, రెవెన్యూ సిబ్బందిని ఉండేలా చూడాలని, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా 24 గంటలూ రికార్డింగ్ ఉండేలా చూడాలని ఆదేశించారు. ఇసుక లోడింగ్ సమయంలో స్టాక్ పాయింట్‌లోని సంబంధిత విఆర్‌ఒ అందించే రశీదుతోపాటు ఆర్‌డిఒ అనుమతి లేఖను కూడా జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు గనుల శాఖకు సంబందించిన సిబ్బంది ఒకరు ప్రతిరోజూ స్టాక్ పాయింట్లను పరిశీలించి, ఇసుక పంపిణీ, నిల్వలను పరిశీలించాలన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ నుండి వినియోగదారుని ఇంటి వద్దకు చేరవేసేందుకు రవాణా ఛార్జీలను వెంటనే ఖరారు చేయాలని కలెక్టర్ రవాణా శాఖాధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలు సీజ్ చేసి, కేసు నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రవికుమార్, ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి, గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ ఇరిగేషన్ రివర్ కన్జర్వేటర్ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, కాలుష్య నియంత్రణమండలి రీజనల్ అధికారి రెజినా బేగం, ఆర్‌టిఒ శ్రీహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతుల హోరు.. ఆందోళనల జోరు

కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటింది. కొత్త జిల్లా అధికారులు విధుల్లోకొచ్చి నెల రోజులు దాటింది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ జనం పెద్దఎత్తున మండల, జిల్లా కార్యాలయాల ఎదుట బారులు తీరుతున్నారు. వినతులిచ్చినా పరిష్కారంకాని తీవ్రమైన సమస్యలపై జనం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు.

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక స్పందన స్థానంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రారంభించింది. ప్రతి సోమవారమూ జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు. వీటిలో ఎక్కువ భూసమస్యలు, అర్హతున్నా పెన్షన్ రావడం లేదని, వ్యక్తిగత సమస్యలతోపాటు రోడ్డు, తాగునీరు ఇతర అంశాలపై అర్జీలు వస్తున్నాయి. వీటిలో ఆర్థిక సంబంధిత అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుండగా మిగిలిన అర్జీల పరిష్కారానికి జిల్లా ఉన్నతాధికారులు సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తున్నారు. ప్రధానంగా జిల్లా అధికారులు వికలాంగులు, వృద్ధుల వద్దకే వెళ్లి అర్జీలు స్వీకరించడం, సమస్యను ఓపిగ్గా అడిగి తెలుసుకుని పరిష్కారానికి నిర్దిష్ట ఆదేశాలు అక్కడికక్కడే ఇవ్వడంతో జనం కూడా ఒకింత సంతృప్తితో వెనుదిరుగుతున్నారు. అయితే అప్పటికీ పరిష్కారం కాని, జనాన్ని తీవ్రంగా వేధిస్తున్న సమస్యలపై వెంటనే రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నారు. వీటిలో తాగునీరు, రోడ్లు వంటి అంశాలపై జనం రోడ్డెక్కుతున్న పరిస్థితి ఉంది. ఏదేమైనా కొత్త ప్రభుత్వం.. కొత్త అధికారుల నేపథ్యంలో కొద్ది రోజులు వేచిచూడాలనే భావన అర్జీదారుల్లోనూ కన్పిస్తోంది. ఏదేమైనా

వినతులు సకాలంలో పరిష్కరిస్తే పాలకులు ప్రజల మనసు గెలుస్తారు. లేనిపక్షంలో జనం ఏదోక రూపంలో రోడ్డెక్కే ప్రమాదముందనే హెచ్చరికలు ఘంటాపథంగా విన్పిస్తున్నాయి.

గత ప్రభుత్వం అమలు చేసిన నూతన విద్యావిధానం దుష్ఫలితాలు మరోసారి తెరపైకొచ్చాయి. జిఒ 117 యథాతథంగా అమలు చేస్తూ ఉపాధ్యాయుల సర్దుబాటుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. ఫ్యాప్టో ఆధ్వర్యాన సర్దుబాటు కౌన్సెలింగ్‌ను బహిష్కరించి నిరసన తెలిపాయి. దీంతో ప్రభుత్వం దిగొచ్చి చర్చలు జరిపి ఉపాధ్యాయుల అభిప్రాయాలను కొన్నింటిని పరిగణనలోకి తీసుకుంది. అదే సమయంలో జిఒ 117 రద్దు అంశాన్ని మాత్రం పక్కన పెట్టింది. అంటే నూతన విద్యావిధానం తీసుకొచ్చిన మోడీ ప్రభుత్వమే కేంద్రంలో అధికారంలో ఉంది. రాష్ట్రంలోనే వైసిపి స్థానంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఫలితంగా నూతన విద్యావిధానం కొనసాగిస్తామని అన్యాపదేశంగా జిఒ 117 అమలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చెప్పకనే చెప్పనట్లయ్యింది. దీన్నిబట్టి ఉద్యోగ, ఉపాధ్యాయులు మరింత అప్రమత్తంగా ఉండాలనేది ప్రభుత్వ విధానం హెచ్చరిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు.

ఇక అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. ఏలూరు జిల్లాలో ఏలూరు, నూజివీడు పట్టణాల్లోనూ, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో ప్రారంభించారు. మరి మిగిలిన పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లోనూ అన్నా క్యాంటీన్లు ప్రారంభించాలని ప్రజాప్రతినిధులపై ఒత్తిడి వస్తోంది. తొలి రోజు పెట్టినంత నాణ్యమైన, రుచికరమైన ఆహారం ప్రతిరోజూ పెట్టాలని జనం కోరుతున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

రుద్రకోటరాజుగూడెంలో డెంగీ జ్వరాలు

మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పారిశుధ్యం మెరుగుకు పంచాయతీ సిబ్బంది చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని రుద్రకోటరాజుగూడెంలో డెంగీ జ్వరాలు విజంభిస్తున్నాయి. ఇప్పటికే డెంగీ జ్వరంతో బాధపడుతున్న కొందరూ జంగారెడ్డిగూడెం ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా గ్రామంలో అనేకమంది జ్వరపీడితులుగా ఉన్నారని, గతంలో డెంగీ కారణంగా జరిగిన మరణాలు పునరావృతం అవుతాయేమోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. రుద్రకోటరాజుగూడెం గ్రామానికి చెందిన పలువురికి జ్వరం రావడంతో ఆసుపత్రికి వెళ్లారు. వైద్యులు పరీక్షలు చేసి డెంగీ నిర్ధారణ చేశారు. ప్లేట్‌లెట్స్ కౌంట్ కూడా తగ్గిందని వైద్యులు చెబుతున్నారు. గ్రామంలో డెంగీ జ్వరాలు ఎక్కువగా ఉండడంతో గ్రామస్తులు భయాందోళనకు

బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

గురవుతున్నారు. దీంతో ఉన్నతాధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించి గ్రామంలో వైద్య సిబ్బందితో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. అలాగే పంచాయతీ సిబ్బంది పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టారు.



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న పాల్ రమేష్

పాల్ రమేష్‌కు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉత్తమ సేవలు అందించినందుకు మండల పరిధిలోని పోతవరప్పాడు గ్రామంలో గ్లాడ్సన్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్ ప్రశంసాపత్రం అందుకున్నారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి చేతులమీదుగా ఈ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. రమేష్ పోతవరప్పాడు గ్రామంలో ఎలిజబెత్ చిల్డ్రన్ హోమ్ ద్వారా అనాథ పిల్లల పోషణ కర్తవ్య బాధ్యతలను తీసుకోవడంతో పాటు వారిని సన్మార్గులుగా తీర్చిదిద్దడం, కరోనా సమయంలో పేదవారికి నిత్యావసర సరుకులను అందించడం, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్, వృత్తి విద్య శిక్షణ, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం వంటి కార్యక్రమాలు గమనించి గత 17 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఆయన సేవలకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా పాల్ రమేష్‌ను పోతవరప్పాడు గ్రామ సర్పంచి టి.సత్యవాణి, గ్రామ పెద్దలు, పాస్టర్లు రెవ కె.దైవనిరీక్షణ కుమార్, కె.పెద్దబాబు, కె.చిన్నబాబు, జార్జి అభినందించారు.

సొంత ఖర్చుతో రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలో రహదారులు అధ్వానంగా మారాయి. రహదారికి రూ.40 కోట్లు మంజూరైనప్పటికీ సాంకేతిక సమస్య వల్ల పనులు నిలిచిపోయాయి. ప్రజల ఇబ్బందులను గమనించి టిడిపి మండలాధ్యక్షుడు మునిశెట్టి నాగేశ్వరరావు రహదారికి మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు చేపడుతున్నామని, త్వరలో పూర్తిస్థాయిలో రహదారి నిర్మిస్తామని మునిశెట్టి నాగేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచి పిచ్చుక రాజు, శ్రీను, బాలాజీ పాల్గొన్నారు.



ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు

సొసైటీల అభివృద్ధికి ఆన్‌లైన్ విధానం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీల అభివృద్ధికి ఆన్‌లైన్ విధానం అవసరమని డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని ఏడు సొసైటీల్లో ఆన్‌లైన్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించేందుకు ముసునూరు కెడిసిసి బ్రాంచ్ మేనేజర్ తలారి వెంకట రంగ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏడు సొసైటీలను శనివారం డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి ఆన్‌లైన్ విధానం ఎంతో మేలు చేకూరుస్తుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల ఆన్‌లైన్ విధానం చేపట్టిందని చెప్పారు. ఆన్‌లైన్ చేయడం వల్ల రైతుకు ప్రతి రూపాయి ఆన్‌లైన్ నమోదు అవుతుందన్నారు. రైతు ఆధార్ సొసైటీ పరిధిలోని తాకట్టు పెట్టిన వ్యవసాయ భూముల వివరాలు, షేర్ విధానం వివరాలు, రైతు వ్యవసాయ భూమి వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదవుతాయన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి నేరుగా ఆ రైతు ఖాతాలో పడుతుందని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ ఆఫీసర్ పద్మశ్రీ, కెడిసిసి బ్యాంకు చీఫ్ మేనేజర్ తలారి వెంకటరమణ ప్రసాద్, సూపర్‌వైజర్ శివరాం ప్రసాద్, బ్యాంకు సిబ్బంది, సొసైటీ కార్యదర్శులు ప్రసాద్, దుర్గారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, లక్ష్మణ, యోహాషువా పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోతనపల్లి యుపి పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా నక్కా నారాయణ, వైస్ ఛైర్మన్‌గా జోనబోయిన సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విప్లవ కుమార్ వ్యవహరించారు, ఎన్నికల పరిశీలకులుగా ఎవి.వెంకటేశ్వరరావు, ఎస్.రాము, వెదుళ్ల వెంకటేశ్వరరావు వ్యవహరించారు. చాట్రాయి ఎంఇఒ వివిఎస్.బ్రహ్మాజీ పర్యవేక్షించారు.

నేరాలు - ఘోరాలు

అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. రెండో పట్టణ ఎస్ఐ మదీనాబాష తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని తంగెళ్లమూడి రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన బంకూరు నాగేశ్వరరావు (44), అతని భార్య స్థానికంగా కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగేశ్వరరావు రెండేళ్లుగా బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అన్ని మర్మిపోవడంతో ఎక్కడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. భార్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అతని కోసం కుటుంబసభ్యులు వెతుకుతున్నారు. నగరంలోని సమాధుల తోటలో అతను ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం ఇది గమనించిన స్థానికులు వెంటనే విషయాన్ని అతని కుటుంబసభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యులు ఏలూరు రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న రెండో పట్టణ ఎస్ఐ మదీనా బాష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

గుండెపోటుతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తు తెలియని వ్యక్తి ఏలూరు ప్రభుత్వాసుపత్రి బయట ఉన్న రాజధాని టిఫిన్ సెంటర్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన భార్య అనారోగ్యంతో ఉండటంతో ఆమె అనారోగ్య అవసరాల నిమిత్తం రక్తం తీసుకునేందుకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. ఈ క్రమంలో ఆసుపత్రి బయట ఉన్న రాజధాని టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ తినడానికి కూర్చుని హఠాత్తుగా అక్కడే కుప్పకూలాడు. టిఫిన్ సెంటర్ సిబ్బంది ఆసుపత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పరిశీలించిన వారు మృతి చెందిన నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పగులగొట్టి కాపర్ వైరు చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సీతాపేట, మక్కినవారిగూడెం, బందంచర్ల, అల్లంచర్లరాజుపాలెం గ్రామాల్లో ఆరుగురు రైతులకు సంబంధించిన వ్యవసాయ పొలాల్లో ఉన్న ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి వాటిలో కాపర్ వైరును చోరీ చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

తాగునీరు అందించండి మహాప్రభో..!

ఏజెన్సీలో పలు గ్రామస్తుల ఆవేదన
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని రెడ్డి కుంకాల, మనుగోపల, జిల్లెలగూడెం, పేట్రాల, ముచ్చలరావుపేట, కొత్త కుంకాల, పాత కుంకాల, రెడ్డి నాగంపాలెం, బక్క బండారుగూడెం గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా సత్యసాయి తాగునీరు తమ గ్రామాలకు రాకపోవడంతో స్థానికంగా ఉన్న సుద్దతో

తాగునీటి కోసం చూస్తున్న మహిళలు

కూడిన నీరు తాగుతున్నామని ఏజెన్సీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సుద్ద నీరు తాగడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్యసాయి పథకం ద్వారా తమ గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని ఆయా గ్రామాల ప్రజలు సత్యసాయి తాగునీరు పైనే ఆధారపడి ఉన్నామని ఏజెన్సీ ప్రజలు చెబుతున్నారు. మొన్న కురిసిన భారీ వర్షాలకు దొండపూడి, నాగంపాలెం మధ్య కాలువ పొంగి ప్రవహించడంతో పైపులైన్లు పాడై సత్యసాయి తాగునీరు నిలిచిపోయింది. అధికారులు స్పందించి తక్షణమే సత్యసాయి తాగునీరు ఏజెన్సీ గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తిగత కారణాలతోనే వైసిపికి రాజీనామా

పార్టీ కార్యాలయం కూల్చివేత ఆరోపణలు అపోహే
మాజీ ఎంఎల్‌ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి కూడా తాను రాజీనామా చేస్తున్నాన్ని, ఇకపై వ్యక్తిగా అందుబాటులో ఉంటానని మాజీ ఎంఎల్‌ఎ ఆళ్ల నాని అన్నారు. ఏలూరులో పార్టీ కార్యాలయం కూల్చివేత ఆరోపణలు అపోహ మాత్రమేనన్నారు. ఆయన ఇంటి వద్ద శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ వైసిపి ఏలూరు జిల్లా అధ్యక్ష పదవికి, ఇన్‌ఛార్జి పదవికి ఇటీవల తాను రాజీనామా చేశానని చెప్పారు. ఇప్పుడు వ్యక్తిగత కారణాల వల్ల పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నానని తెలిపారు. పార్టీ కార్యాలయం కూల్చివేత విషయంలో కూడా ఎవరూ అపోహ పడొద్దన్నారు. ఆ పార్టీ కార్యాలయం ఎవరైతే లీజుకు ఇచ్చారో ఆయన అమెరికాలో ఉంటారని, ఆయన తన మిత్రుడు రవిచంద్ర అని తెలిపారు. రాజకీయ పార్టీకి కార్యాలయ మంటే ఎవరూ ముందుకు రారని, కాని తన అభ్యర్థన మేరకు రెండేళ్ల లీజు కోసం 2017లో ఆ స్థలం తీసుకున్నామని చెప్పారు. ఆ తర్వాత తాత్కాలిక నిర్మాణాలు చేపట్టామన్నారు. కాని గతేడాది ఆ స్థలం తిరిగి ఇవ్వాలని, డెవలప్‌మెంట్‌కి ఇచ్చుకుంటామని స్థల యజమాని కోరినట్లు చెప్పారు. ఆ విషయం గతేడాది రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డికి చెప్పామన్నారు. ఆయన ఎన్నికలకు మూడు నెలల ముందే స్థలం యజమానికి ఇచ్చేయాలని చెప్పారన్నారు. కాని ఎన్నికల వేళ కార్యాలయం తీసేస్తే మంచి విధానం కాదనే ఉద్దేశంతో సమయం తీసుకున్నామని చెప్పారు. 15 రోజుల క్రితమే స్థలాన్ని యజమానికి హ్యాండోవర్ చేయమని పార్టీ నాయకులు నిర్ణయించా రన్నారు. దీంతో ఈ నెల ఒకటో తేదీన స్థలాన్ని హ్యాండోవర్ చేశామని తెలిపారు. ఆగస్టు 15 కార్యక్రమ నిర్వహణ కోసం స్థల యజమాని అనుమతి తీసుకుని కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనంతరం ఆగస్టు 16వ తేదీన స్థలాన్ని స్థల యజమాని పూర్తిస్థాయిలో హ్యాండోవర్ చేసుకున్నారన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని తెలిపారు. ప్రజలు, నాయకులు ఈ విషయం గమనించాలని కోరుతున్నానన్నారు. గెలుపు ఓటములకు అతీతంగా ఏలూరు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, తన రాజీనామా కేవలం తన వ్యక్తిగతం మాత్రమేనని తెలిపారు.

పరిసరాల పర్యావరణంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

రైతులకు పరిసరాల పర్యావరణ విశ్లేషణపై అవగాహన అవసరమని, నాణ్యమైన ఉత్పత్తులను ఎక్కువగా సాధించడానికి వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏలూరు, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ నాగేంద్ర కోరారు. భీమడోలు వ్యవసాయ అధికారిణి ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం దుద్దేపూడి గ్రామంలోని మేలైన యాజమాన్య పద్ధతులు అమలు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాల వద్ద పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏరువాక కేంద్రానికి చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు ఇద్దరూ హాజరయ్యారు. ఈ క్రమంలో రైతులతో వారు మమేకమయ్యారు. వారు అమలు చేస్తున్న వ్యవసాయ పద్ధతులు అడిగి తెలుసుకుని, మేలైన సాగు చేసేందుకు తగు సూచనలు అందించారు. అనంతరం వరి సాగు అవుతున్న వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఆ క్షేత్రాల్లో వరి పైరుకు కంకి నల్లి, దుబ్బు తెగులు ఆశించినట్లు గుర్తించారు. వాటి నివారణకు, అదుపు చేసేందుకు రైతులకు తగు సూచనలు చేశారు. పరిసరాల పర్యావరణ విశ్లేషణలో పైరును ఆశించే శత్రు, మిత్ర పురుగులు కీలకపాత్రను పోషిస్తాయని తెలిపారు. శత్రు పురుగులను అదుపు చేయటంతో పాటు మిత్ర పురుగులైన తూనీగా, సాలీడు, అక్షింతల పురుగులతో పాటు ఇతర పురుగులు పైరుకు చేసే మేలును చార్ట్ ద్వారా వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం సాగు విధానం గురించి తెలిపారు. తక్కువ ఖర్చుతో మేలైన దిగుబడులు

రైతులకు మేలైన సాగు పద్ధతుల గురించి వివరిస్తున్న శాస్త్రవేత్తలు

సాధించేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందన్నారు. దీనిలో భాగంగా జీవామృతం తయారీ, దాని వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, పైరుకు మేలు చేసే సూక్ష్మజీవుల అభివృద్ధి ఇతర అంశాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అన్ని తరగతుల ప్రజలు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు తమవంతు సహాయం అందించేందుకు వస్తున్న దాతలను స్ఫూర్తిగా తీసుకుని ఈ సామాజిక యజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏలూరు పవర్‌పేటలోని టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు ఏలూరు 27వ డివిజన్ సాయినాథ్ నగర్‌కు చెందిన లచ్చిరెడ్డి రామారావు రూ.లక్ష చెక్కును ఎంఎల్‌ఎ బడేటి చంటికి అందించారు. అనంతరం లచ్చిరెడ్డి రామారావును ఎంఎల్‌ఎ దుశ్శాలువాతో సత్కరించారు.

ఎస్‌సి వర్గీకరణ తీర్పును పున:సమీక్షించాలి

మాల జాతి యోధుల పోరాట సంఘం ఆధ్వర్యాన ర్యాలీ
కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎస్‌సి వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాలని కోరుతూ ఏలూరులో మాల జాతి యోధుల పోరాట సంఘం ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది మాలలు ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రయివేట్ రంగ సంస్థల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని, ముందు జన గణన, కుల గణన జరిగిన తరువాతే పార్లమెంటు ఆమోదంతో రాజ్యాంగ బద్ధంగా వర్గీకరణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెండెం సంతోష్‌కుమార్, నేతల రమేష్‌బాబు, ప్రొఫెసర్ ఎస్ఎడి.పాల్, దాసరి రమేష్, అలగ రవి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి కలిగి ఉండాలని భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి అన్నారు. మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కె.ప్రేమకుమార్ ఆధ్వర్యంలో భీమడోలు శ్రీ మాధురి జూనియర్ కళాశాల వేదికగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి, అతిథిగా ఎంఇఒ-2 భాస్కరకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల వారిలో

విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రముఖులు

పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఆత్మవిశ్వాసం, తమపై తమకు నమ్మకం ఏర్పడతాయని వివరించారు. ఇవన్నీ విద్యార్థులు చదువుకునే సమయంలో వారు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు పరోక్షంగా సహకరిస్తాయని వివరించారు. ఎంఇఒ భాస్కరకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొని గుర్తింపు పొందడం ద్వారా చదువుతోపాటు, ఉపాధిని సాధించడంలో రాయితీలను సాధించవచ్చని వివరించారు. కళాశాల విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా చదువుకోవడంతోపాటు, ఎన్‌సిసి వంటి అంశాల్లో క్యాడెట్లుగా చేరి ప్రత్యేక గుర్తింపు పొందాలని కోరారు. మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఐదు అంశాల్లో క్రీడా పోటీలు, వారిలో విజ్ఞానం పెరగడానికి క్విజ్ పోటీలు, దేశభక్తి గీతాలు ఆలాపన, వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన ఆచార్యులు అశోక్, కేసరి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.బాలు పాల్గొన్నారు.

మండలాన్ని జిల్లాలో ముందంజలో ఉంచాలి

ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ

బదిలీపై వెళ్తున్నవారిని సత్కరిస్తున్న ఎంపిపి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో జిల్లాలో ముందంజలో ఉంచాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ సమావేశపు హాలులో శనివారం నిర్వహించిన సమావేశంలో మండలానికి చెందిన పలువురు ఉద్యోగులు బదిలీపై వెళ్లిన సందర్భంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో సమర్థవంతంగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఎంపిడిఒ ఎన్ఎం.గంగాధరరావు, ఉద్యోగోన్నతిపై వేరే జిల్లాకు వెళ్లిన పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, యార్లగడ్డ శ్యాంసుందర్, నాగలక్ష్మి, షహనాజ్‌లకు, అలాగే మరోసారి ముదినేపల్లి ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన పి.మల్లేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బదిలీ అనేది ఉద్యోగుల జీవితాల్లో సాధారణ విషయమన్నారు. అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు అన్నిచోట్ల గౌరవం లభిస్తుందన్నారు. బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ, ఎఒ కె.రమణబాబు, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరతూ ఆ అసోసియేషన్ నాయకులు ఏలూరు జిల్లా నుంచి వరిపల్లి చెన్నారావు, పశ్చిమగోదావరి జిల్లా నుంచి జి.వాసు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందించారు. నిడదవోలు వెళ్లి మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కంప్యూటర్ ఆపరేటర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమస్యలను ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

కామయ్యపాలెంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జంగారెడ్డిగూడెం మమత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు హాజరై రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం రక్తదాన శిబిరం వద్దకు చేరుకుని రక్తదానం చేసిన వారిని అభినందించారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితులకు అందించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన పలువురికి పరీక్షలు చేసి మందులు ఇచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కరాటం సాయి, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, టి.రవి, శ్రీను, మధు, సాయి, మమత ఆసుపత్రి యాజమాన్యం పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నారాయణపురంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉషోదయ హైస్కూల్ నుంచి జాతీయ రహదారి వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రజలంతా ప్రశాంతంగా శాంతికి భంగం కలగకుండా ఉండాలంటూ నినాదాలు చేశారు.

నారాయణపురంలో మానవత శాంతి ర్యాలీ

మానవత మండల శాఖ అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు, కార్యదర్శి గంజి రవికుమార్, రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ, మండల ఛైర్మన్ గుణ్ణం బుల్లెబ్బాయి, కన్వీనర్ అడపా శ్రీను, సభ్యులు బొమ్మిడి అప్పారావు, సూర్యనారాయణరాజు, ఎన్.గంగాధర్, సతీష్, ఉదోదయ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, శ్యామలారాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్య విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడి చంపడం సభ్య సమాజం తలదించుకునేలా చేసిందన్నారు. సమాజంలో రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు చేసినవారిని వెంటనే శిక్షించకుండా విషయాన్ని పక్కదారి పట్టించేవిధంగా చేయటం చూస్తుంటే ప్రభుత్వం నిందితులకు అండగా నిలుస్తున్నట్లు అనిపిస్తుందని విమర్శించారు. వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితుల కుటుంబానికి ప్రభుత్వం సహకారంగా ఉండాలని కోరారు.

న్యాయవిజ్ఞానంపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి పెదఖాసీం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యార్థి దశలోనే న్యాయవిజ్ఞానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె.పెదఖాసీం అన్నారు. నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూల్ ఆవరణలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె పెద ఖాసీం మాట్లాడుతూ విద్యార్థి దశలో న్యాయ విజ్ఞానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పేదలకు ఉచిత న్యాయ సలహాలు, సేవలు అందించేందుకు కోర్టులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయన్నారు. ఈ అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ భాగవతుల హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ రాణి

గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 16 గ్రామాల గ్రామ సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందితో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాణి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె.పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రానికి గ్రామాలే ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. ఉపాధి హామీ కల్పనతో మంచినీటి సదుపాయం, డ్రెయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, చెరువుల అభివృద్ధి, కాలుష్యం నివారణకు చెట్ల పెంపకం, పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఆయా గ్రామ పంచాయతీ సమావేశాలు ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించి ఆయా గ్రామాలకు కావాల్సిన సదుపాయాలు తీర్మానించి అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకటరావు, వైస్ ఎంపిపి పాముల గంగాధరరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాగుపాడు పిహెచ్‌సిలో ఎంపిపి తనిఖీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కాగుపాడు పిహెచ్‌సిని ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, సర్పంచి కడియాల సుదేష్ణ శనివారం తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా తీసుకుంటున్న చర్యలను డాక్టర్ మానస ప్రజాప్రతినిధులకు వివరించారు. వైరల్ ఫీవర్లు అన్ని చోట్లా ఉన్నట్లు వైద్య సిబ్బంది వెల్లడించారు. ఆమెతో పాటు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు ఉన్నారు.

In the Court of the Hon'ble VIIth Addl. Junior Civil Judge, Rajahmundry

O.S. No. 1005 of 2019

Between:

Yakkala Malleswara Rao, S/o. Veerabhadram, Hindu, aged 47 years, R/o. Door No. 2-77, Veeravaram, Kadiyam Mandal, East Godavari District, A.P. ***...Plaintiff***

AND

Inti Srirama Murthy, S/o. Subba Rao, Hindu, aged 48 years, R/o. Door No. 2-50/1, Duvva Village, Tanuku Mandal, West Godavari District, A.P. ***...Defendant***

Whereas the above named plaintiff filed the above suit for recovery of amount from the defendant. The plaintiff send summons through court and RP but you are not received the same intentionally. The above suit is posted **on 29-08-2024 for your appearance at 10.30 a.m.,** before the said court. Take notice that if you failed to appear before the said court on that day, the matter will be proceeded ex-party in your absence.

KOTHAPALLI SRINIVASU
Advocate, Rajahmundry
Cell: 97052 56019